క్లుప్తంగా

సన్మానం



తిప్పారెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండల రైతు సంఘం అధ్యక్షుడు చెర్లోపల్లి తిప్పారెడ్డిని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. మంగళవారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మండల ఉపాధ్యక్షులు హనుమంతరెడ్డి, కన్వీనర్ నరసారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో తిప్పారెడ్డిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో రమణారెడ్డి, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

పల్లెలకూ పశు వైద్యసేవలు



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీ మల్లేష్ పాటిల్

పుట్టపర్తి: మారు మూల గ్రామాలకు సైతం పశు వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కొత్తచెరువు పశు వైద్య శాఖ ఏడీ మల్లేష్ పాటిల్ అన్నారు. ఆయన మంగళవారం బుక్కపట్నం పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొబైల్ వ్యాన్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు పశు వైద్య సేవలు విస్తరించామన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

'ఆయుష్ శాఖ' ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ మంగళవారం పట్టణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, విద్యార్థులు, పలువురు పట్టణ ప్రజలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్‌వీ.కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఆయుష్ శాఖ సీనియర్ వైద్యుడు డాక్టర్ కిష్టయ్య మాట్లాడుతూ బుధవారం ఉదయం 6.50 నుంచి 7.50 గంటల వరకు పట్టణంలోని హనుమాన్ దేవాలయం వెనుక గల విశ్వకళ్యాణి భవన్‌లో యోగా దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పుడా చైర్మన్ లక్ష్మీనరసమ్మ, వైద్యుడు డాక్టర్ నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

వాసవీమాత.. నమోస్తుతే



గోరింటాకు అలంకరణలో అమ్మవారు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో మంగళవారం వాసవీమాత గోరింటాకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. శ్రీ వాసవీ మహిళా మండలి సభ్యులు అమ్మవారిని 200 కేజీల గోరింటాకుతో అలంకరించి పూజలు చేశారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరంరూరల్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పశు బీమా పథకాన్ని రైతులు, గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశువర్ధకశాఖ ఉప సంచాలకులు (డీడీ) డాక్టర్ చంద్రశేఖర్ సూచించారు. మంగళవారం పట్టణ పశువైద్యశాలలో పశు బీమా పథకంపై సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువర్ధక శాఖ ఉప సంచాలకులు ఎం. వీరబద్రయ్య, డాక్టర్లు శేఖర్, రామేశ్వర రావు తదితరులున్నారు.

సంజాయిషీ ఇవ్వండి

కదిరి అర్బన్: పట్టణంలోని జైన్ పాఠశాల, కేఎల్ఎస్, ఆర్‌కే ఇనిస్టిట్యూట్‌ను మంగళవారం ఎంఈఓ చిన్ని క్రిష్ణ ఆకస్మిక తనిఖీ చేశారు. జైన్ పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. సీబీఎస్‌సీ సిలబస్‌కు అనుమతి లేకున్నా అనుమతి ఉన్నట్లు విద్యార్థులను చేర్చుకున్నారని గుర్తించారు. తరగతుల వారీగా ఫీజు వివరాలలో వ్యత్యాసాలను గమనించారు. వీటిపై సంచాయిషీ ఇవ్వాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అలాగే కేఎల్ఎస్ ఇనిస్టిట్యూట్,ఆర్‌కే ఇనిస్టిట్యూట్‌లు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు గుర్తించి వారికీ నోటీసులు జారీ చేశారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట



గాండ్లపెంట: విద్యార్థులకు మెడల్స్ అందించిన ఎంఈఓ, హెచ్‌ఎంలు



తాడిమర్రి: విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న దృశ్యం

• ఎంఈఓ కృష్ణానాయక్

గాండ్లపెంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద పిల్లలు సైతం ఉన్నత చదువులు చదవాలన్న మంచి ఉద్దేశంతో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఎంఈఓ కృష్ణానాయక్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం మధురాంబ అధ్యక్షతన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ కృష్ణానాయక్, ఎంఈఓ-2 శ్రీనివాసులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి పాల్గొని మాట్లాడారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో 572 పొంది మండలటాపర్‌గా నిలిచిన టి. జ్యోతిశ్రీ, రెండవ స్థానంలో నిలిచిన యస్. ఆసిఫ్ 559 మార్కులు, మూడవ స్థానంలో నిలిచిన యస్. సానియా (557 మార్కులు) లకు ప్రశంసా పత్రంతో పాటు మెడల్‌ను రూ.3,000, రూ.2,000, రూ.1,000 బహుమతులను అందించారు. ఉపాధ్యాయుడు విశ్వనాథరెడ్డి రూ.3,500 నగదును ముగ్గురు విద్యార్థులకు అందించాడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగాధర్, విశ్వనాథరెడ్డి, ముంతాజ్‌అలీ, చిన్నప్పయ్య, సిద్దారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

• మండల పరిధిలోని తుమ్మలబైలు ఉన్నత పాఠశాలలో మంగళవారం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మురాద్‌షావలీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రాజన్న హాజరయ్యారు. కిరణ్‌కుమార్‌నాయక్, వరుణ్‌సందేశ్, శ్రేయకు వరుసగా రూ.3,000, 2,000, 1,000 నగదుతో పాటు ప్రశంసాపత్రం, మెడల్‌ను అందించారు.

విద్యార్థులను ప్రోత్సహించడం కోసమే..

ఎన్పీకుంట: విద్యార్థులను ప్రోత్సహించడం కోసమే 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఎంపీపీ ఈటెరాము అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీలో మంగళవారం నిర్వహించిన 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమానికి ఎంపీపీ, ఎంపీడీఓలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 537, 486 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన సయ్యద్ సల్మ, పి.విజయలక్ష్మి లకు ఒక్కొక్కరికి రూ.3 వేల నగదు, 485, 473 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచిన స్వాతి, జన్నె నాగపుష్పలకు ఒక్కొక్కరికి రూ.2 వేలు నగదు, 463, 455 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచిన పి.నవీన్‌కుమార్, అమృతకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున నగదుతో పాటు మెడల్, సర్టిఫికెట్లను అందించి అభినందించారు.

• జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలలో 537 మార్కులు సాధించిన సయ్యద్ సల్మకు పాఠశాల విద్యార్థుల తరపున రూ.2,000 నగదును ఎంపీపీ, హెచ్‌ఎం చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, వైస్‌ఎంపీపీ కేశవరెడ్డి, స్థానిక సర్పంచ్ ఆంజినమ్మ, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్, హెచ్‌ఎం శిరీషారెడ్డి, ఎస్ఓ రూపారాణి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కనగానపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు.మంగళవారం మండలంలోని తూంచర్లలో ఆమె స్థానిక ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. దీంతో పాటు విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రంగారెడ్డి, స్కూల్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శుభపరిణామం..

పుట్టపర్తి: విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కింద నగదు, సర్టిఫికెట్ అందించటం శుభపరిణామమని సర్పంచ్ నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. వారు మంగళవారం బుక్కపట్నం బాల, బాలికల ఉన్నత పాఠశాలలో 'జగనన్న ఆణిముత్యాలు' కింద ఎంపికైన నిఖిత, అష్వాన్నా, గౌతమీ, బాలుర పాఠశాలకు చెందిన నవరత్న, అఖిల్, దుర్గేష్‌కు నగదు, సర్టిఫికెట్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జగదీష్, రహిమాన్, పాఠశాల సింబంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



బుక్కపట్నంలో ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తాడిమర్రి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మక విద్య లభిస్తుందని ఎంఈఓ కృష్ణమోహన్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం అరుణ అధ్యక్షతన జరిగిన 'ఆణిముత్యాలు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ.శైలజ, ఆర్.భానుసాయి ప్రసాద్, సి.మానసలకు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1,000 నగదు బహుమతులతో పాటు బంగారు, వెండి, కాంస్య పతకాలు వేసి, ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజ, రాజ్యలక్ష్మీ, మదన్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఆర్పీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

చెన్నేకొత్తపల్లి: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మేడాపురంలో రూ.2.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ మోటార్లకు లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు నియోజకవర్గంలోని మేడాపురం, కుంటుమద్ది గ్రామాల్లో ప్రభుత్వం సబ్ స్టేషన్‌ను మంజూరు చేసిందన్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో మేడాపురం గ్రామ రైతుల కోసం చేపట్టిన పాదయాత్రలో సబ్ స్టేషన్ నిర్మిస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చామని ఆయన గుర్తు చేశారు.

వాళ్లు రక్తం పారిస్తే నేను నీళ్లు పారిస్తున్నా..

25 ఏళ్లుగా రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లో పరిటాల కుటుంబం రక్తం పారిస్తే, నేను నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ నీళ్లు అందిస్తున్నానని, దశాబ్దాల కాలం నుంచి వట్టిపోయిన పేరూరు డ్యాంకు నీరు అందించడమే కాకుండా రామగిరి బంగారు గనులు తెరిపిస్తున్నానన్నారు. మహిళా పాడి రైతులకు అండగా నిలిచేందుకు తోపుదుర్తి సహకార 'అమ్మ డెయిరీ'ని తన సొంత నిధులను రూ.20 కోట్లతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. తన సొంత నిధులతో ఫ్యాక్షన్ నిర్మూలనకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని పాడి రైతులకు ఉచితంగా బర్రెలు, గొర్రెలతోపాటుగా 1000 మందికి ఉచితంగా బోర్లను వేసి, అండగా నిలిచామన్నారు. ప్రజాసమస్యలను తాను నిత్యం పరిష్కరిస్తుంటే తమ ఉనికిని కోల్పోతామనే ప్రతిపక్షాలు తనపై అవాకులు, చవాకులు పేలుతున్నాయన్నారు. గత పాలకులకు, తనకు మధ్య తేడాను గమనించి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయ్య, విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ ఏడీఈ శ్రీకాంతరెడ్డి, ఏడీఈలు కిరణ్‌కుమార్ మోహనమ్మ, మండల ఇన్‌చార్జ్ ఏఈ మదన్‌మోహన్, ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామకృష్ణా రెడ్డి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ గంగావతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగిల్ మేజర్ డిగ్రీ కోర్సులలో భాగంగా బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ, ఫిజిక్స్ మేజర్, కంప్యూటర్స్ మైనర్ కోర్సుల కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విభాగాలు ప్రవేశపెట్టామని తెలిపారు. కళాశాలల వేళల్లో ఆర్టీసీ బస్సుల సౌకర్యం, వసతి గృహ సదుపాయం, అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్ అందుబాటులో ఉన్నట్లు వివరించారు. ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 26 నుంచి 30 వరకు విద్యార్థులు నచ్చిన కళాశాలల ఆప్షన్లు ఇచ్చుకోవాలని తెలిపారు. జులై 3న కళాశాలల కేటాయింపుతో ప్రక్రియ ముగుస్తుందని తెలిపారు. ఈనెల 25 లోపు కళాశాలలో గాని, ఇంటర్‌నెట్ సెంటర్లలో గాని పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9441177709, 9290198899, 9133437806, 9885284443 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

'జగనన్న సురక్ష'తో నమ్మకం పెంపు

పుట్టపర్తి అర్బన్: సమస్యలను పరిష్కరించి ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంచేందుకు 'జగనన్న సురక్ష' కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని పుట్టపర్తి ఎంపీపీ ఏవీ రమణారెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్‌రెడ్డితో కలిసి మండల పరిధిలోని పెడపల్లి 1,2 ,జగరాజుపల్లి సచివాలయాల్లో మంగళవారం కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సమస్యలను నమోదు చేసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సర్టిఫికెట్ కావాలన్నా అందజేయాలన్నారు. నెల రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మంగ్లీబాయి, లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీ సరస్వతీబాయి, అగ్రీ బోర్డు చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, నాయకులు సతీష్‌రెడ్డి, మల్లిరెడ్డి, రమణారెడ్డి, మల్లిఖార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ అశోక్‌కుమారెడ్డి

1 నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వచ్చేనెల 1నుంచి 'జగనన్న సురక్ష' కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ గంగావతి తెలిపారు. జూలై 1న కనుముక్కల-1 సచివాలయం, 4న గంగినేపల్లి, 6న కనుముక్కల-2 సచివాలయం, 7న మేడాపురం-1 సచివాలయం, 11న మేడాపురం-2, 13న వెంకటంపల్లి, 15న ప్యాదింటి, 18న నాగసముద్రం, 20న చెన్నేకొత్తపల్లి-1 సచివాలయం, 22న న్యామద్దల-2, 28న ముష్టికోవెల సచివాలయ పరిధిలోని గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు

• ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గోళ్లవారిపల్లి, హరిజనవాడ, బండ్రేవారిపల్లి, దుగినేపల్లి, గణాధివారిపల్లి, ఎస్సీ పురం, కనసానివారిపల్లి గ్రామాలలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాల లబ్ధి ఇంటి వద్దే అందుతోందని లబ్ధిదారులు తెలిపారు. ఇంకా పరిష్కారానికి నోచుకోని ఏవైనా సమస్యలు ఉంటే చెప్పాలని, వాటిని సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఆయా గ్రామాలలో మిగిలిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు వేయించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరారు. సీసీ రోడ్ల, డ్రైనేజీ కాలువలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. తమకు ఇంటి స్థలం ఉందని, ఇళ్లు మంజూరు చేయించాలని పలువురు మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో అర్హులైన వారికి మంజూరయ్యేలా చూడాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. గోళ్లవారిపల్లి హరిజనవాడలో విద్యుత్ స్తంభాల కొరత ఉందని, వెంటనే అవసరమైన చోట స్తంభాలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్రాన్ని ఆ పార్టీ నాయకులు అడ్డంగా దోపిడీ చేశారన్నారు. జగనన్న సీఎం కాగానే అవినీతికి ఆస్కారమే లేకుండా పథకాల డబ్బును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ పూల నరసింహులు, సర్పంచులు డీ. సరస్వతీ, కృష్ణారెడ్డి, సురేష్, అగ్రీ బోర్డు చైర్మెన్ కొండా మల్లికార్జున, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్‌దేశాయ్, కో-ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, నాయకులు శ్రీనివాసులనాయుడు, చిదానందరెడ్డి, జంగమరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రమణారెడ్డి, రామాంజులరెడ్డి, రామకృష్ణ, నీలకంఠారెడ్డి, శ్రీనివాసులు, రెడ్డెప్పరెడ్డి, గణేష్‌రెడ్డి, శ్రీకంఠారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గోళ్లవారిపల్లి హరిజనవాడలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు పనులు

కదిరి అర్బన్: యర్రదొడ్డి పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో మంగళవారం రూ.10 లక్షల పంచాయతీ నిధులతో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో తమ గ్రామంలో సీసీ రోడ్డు వేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సిద్దారెడ్డి రోడ్డు మంజూరు చేయించారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఎంఈఓ-2ల బాధ్యతల స్వీకరణ

ఎన్పీకుంట: మండల విద్యాధికారి-2 గా సుబ్బిరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు జాయినింగ్ లెటర్ అందజేసి బాధ్యతలు స్వీకరించారు. పలువురు వైఎస్సార్‌టీఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు.

ఓడీచెరువులో రమణ..

ఓడీ చెరువు: ఓడీ చెరువు ఎంఈఓ-2 గా రమణ మంగళవారం నూతన బాధ్యతలు స్వీకరించారు. ఎంఈఓ ఖాదర్‌వలి, పలువురు ఉపాధ్యాయులు పూలమాలలతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

గాండ్లపెంటలో శ్రీనివాసులు..

గాండ్లపెంట: మండల విద్యాధికారి-2గా ఎం.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక విద్యాధికారి కార్యాలయంలో విద్యాధికారి-1 క్రిష్టానాయక్‌తో కలిసి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యాయులు ఎంఈఓ-2కు అభినందనలు తెలిపారు.

తలుపుల ఎంఈఓ-2 గా విజయ్‌కుమార్..

తలుపుల: స్థానిక ఎంఆర్‌సీలో నూతన ఎంఈఓ-2 గా విజయ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎంఈఓ వెంకట్రాముడు, ఉపాధ్యాయులు సాదరంగా ఆహ్వానించారు. విజయ్‌కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో విద్యాపరంగా సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

కదిరిలో ఓబుల్‌రెడ్డి..

కదిరి అర్బన్: కదిరి మండల విద్యాశాఖాధికారి-2గా ఓబుల్‌రెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఓబుల్‌రెడ్డికి స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో పలువురు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

వర్షం కోసం నాటక ప్రదర్శన

ధర్మవరం రూరల్: వర్షాలు సకాలంలో కురవాలంటూ మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో సోమవారం రాత్రి గ్రామ పెద్దలు, ఓం శక్తి కళాకారుల ఆధ్వర్యంలో విరాట పర్వం నాటకాన్ని ప్రదర్శించారు. అంతకు ముందు ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

అయ్యప్పస్వామికి జలాభిషేకం

ఓడీ చెరువు: మండలంలోని ఎం.కొత్తపల్లిలో వెలసిన అయ్యప్పస్వామి ఆయలంలో మంగళవారం అయ్యప్ప విగ్రహానికి 101 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులునాయుడు మాట్లాడుతూ అయ్యప్పకు జలాభిషేకం చేస్తే వరుణ దేవుడు కరుణిస్తాడని తెలిపారు.

వంట సరుకుల పంపిణీ

ధర్మవరం రూరల్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ వ్యవస్థాపకులు తారకనాథ్ 19వ వర్ధంతి సందర్భంగా మంగళవారం గొట్లూరు అనాథాశ్రమానికి వంట సరుకులు, మంచాలు, పరుపులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు పుష్పలత, భాస్కర్, కిరణ్‌కుమార్, సాయి కిరణ్, ఓబిలేసు, అజయ్‌కుమార్‌రెడ్డి, లోహిత్, భరద్వాజ్, తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే నెల రోజుల్లో తెలపండి

కదిరి: మూర్తిపల్లి వద్ద హిందూ శ్మశాన వాటికలో శవాలను దహనం చేసేందుకు మోడ్రన్ క్రిమటోరియమ్ ఏర్పాటుపై ఎవరికైనా అభ్యంతరాలుంటే నెల రోజుల్లోపు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కట్టెలతో దహనం చేస్తే చుట్టు పక్కల నివాసముంటున్న వారికి ఇబ్బందులు రావచ్చని, అయితే అధునాతన పద్ధతిలో దహనం చేసేందుకు తమకు అనుమతులు కావాలని పట్టణానికి చెందిన ఆర్య,వైశ్య సంఘం అధ్యక్షులు మేడా వర ప్రసాద్ కోరారని కమిషనర్ గుర్తు చేశారు. దీనిపై ప్రజలు సూచనలు, సలహాలతో పాటు అభ్యంతరాలు తెలియజేయాలని పేర్కొన్నారు.

యువకుడికి గాయాలు

నల్లచెరువు:యర్రగుంట పల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాగే పల్లికి చెందిన వెంకటేష్‌కు గాయాలయ్యాయి. మంగళవారం కదిరి వైపు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న వెంకటేష్‌ను యర్రగుంట పల్లి మిట్ట వద్ద తనకల్లు వైపు నుంచి ఎదురుగా వచ్చిన ఆటో ఢీ కొంది. వెంకటేష్ కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కదిరి ఆసుపత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థిక సాయం అందజేత

గాండ్లపెంట: మండల పరిధిలోని జీనులకుంట గ్రామానికి చెందిన వెంకటరమణ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి వెంకటరమణ కుటుంబానికి మంగళవారం రూ.10 వేల ఆర్థిక సహయం అందించారు.

ఎకరాకు రూ. 10 వేలు ఇవ్వాలి

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎకరం సాగుకు రూ. 10 వేలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జిల్లా రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు రైతు ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరా వేళలు మార్చాలి

ధర్మవరం రూరల్: వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేయాలని మండల పరిధిలోని చింతలపల్లి, వసంతపురం గ్రామాలకు చెందిన రైతులు కోరారు. మంగళవారం ఆ శాఖ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు.

విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు

ఎన్పీకుంట: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వైద్యాధికారులు, సిబ్బందిపై కలెక్టరుకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ ఈటెరాము, ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం వారు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాఫ్‌నర్స్ మినహా సిబ్బంది ఎవరూ లేనందున ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం అడ్డగింత

నల్లచెరువు: జోగన్నపేట వద్ద నూతనంగా నిర్మిస్తున్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను జోగన్నపేట, బొమ్మిరెడ్డిపల్లి, ఎస్సీ కాలనీ గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. పనులు చేపడితే తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ శ్రీనాథ్‌రెడ్డి, గ్రామస్తులు రాజశేఖర్,శ్రీకంఠరెడ్డి, తిరుపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించండి

నల్లమాడ: పీఎం కిసాన్ డబ్బు బ్యాంక్ ఖాతాలో జమ కావాలంటే ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ సుమతి సూచించారు. వారంలోపు చేయించుకోవాలని తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

తనకల్లు: స్థానిక సుధా టాకీస్ రోడ్డులో ఉన్న గ్రంథాలయాన్ని గ్రంథాలయ కార్యదర్శి రమా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైబ్రేరియన్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

గాండ్లపెంట: కటారుపల్లి శాఖ గ్రంథాలయాన్ని ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమా మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయ అధికారి లక్ష్మీనాయక్ ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486